
# రాష్ట్రప్రభుత్వం సాగిస్తున్న 'జలయజ్ఞం'లో..




**కాం**గ్రెస్ ప్రభుత్వానికి ఒక సంవత్సరం నిండిన సందర్భంగా వారు సాధించిన ఘనకార్యాల గురించి చేసుకున్న ప్రచారంలో 'జలయజ్ఞానికి' చాలా పెద్దపీట వేసిన సంగతి అందరం చూశాము. రాష్ట్రంలో ఏ మూలకు పోయినా పెద్దపెద్ద కాలువలు తవ్వుతుండడం చూస్తున్నాము.

**రెం**డు సంవత్సరాలలో 8 ప్రాజెక్టులూ, అయిదేళ్ళలో మొత్తం 30 ప్రాజెక్టులూ నిర్మిస్తామన్నది కాంగ్రెస్ వారి హామీ. అదే 'జలయజ్ఞం'. దీనికోసం ఇప్పటికే 27 వేల కోట్లు ఖర్చయ్యే 157 పనులు మొదలయ్యాయంట. అందులో 68 పనులు (వ్యయం 13 వేల కోట్లు) తెలంగాణలోను, 46 పనులు (వ్యయం 8 వేల కోట్లు) కోస్తా ఆంధ్రలోను, 43 పనులు (వ్యయం 6 వేల కోట్లు) రాయలసీమలోను చేపడుతున్నారంట. అయిదేళ్ళలో 30 ప్రాజెక్టులూ పూర్తిచేసి 65 లక్షల ఎకరాలను కొత్తగా సాగునీటి కిందికి తీసుకురావడంతో పాటు మరొక 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తారంట.

**ఇ**ది అసాధ్యం అని ఎవరైనా అంటే, అందులో సగం సాధ్యమయినా మంచిదే కదా అనేవాళ్ళుంటారు. నాలుగవ వంతయినా జరగదంటారా అనేవాళ్లూ వుంటారు. ఏమీ చేయకుండా వుండడం కంటే ఏ కొంచెం చేసినా మేలే కదా అనేవాళ్లు సహితం వుంటారు.

**సా**ధ్యాసాధ్యాలనూ అవసరాన్నీ దృష్టిలో వుంచుకొని ఏ ప్రాజెక్టులు ఇప్పుడే సాధ్యమో, ఏవి ఎక్కువ అవసరమో, వేటివల్ల నిజంగా మేలు జరుగుతుందో వాటితో మొదలుపెట్టినట్టయితే, చివరికి నాలుగవవంతే జరిగినా అంతకంటే తక్కువే జరిగినా ఫరవాలేదనుకోవడంలో తప్పులేదు.

**కా**నీ ఇప్పుడు జరుగుతున్నది అదికాదు. 30 ప్రాజెక్టుల మీదా పని ఏకసమయంలో మొదలయి వేలకోట్లు కేటాయించేశారు. పనులు కాంట్రాక్టర్లకిచ్చి మొదలుపెట్టించేశారు. రాబోయే ఆయకట్టును ఊహించుకుని ఆశలు పెట్టుకొమ్మని రైతులకు చెప్పేశారు. వీటిలో సగం ప్రాజెక్టులు సాధ్యం కాకపోతే సగం డబ్బులు వృధా అవుతాయి. సగం ఆశలు వమ్మవుతాయి. వృధా అయిన ఖర్చు ప్రజలందరికీ భారం అవుతుంది. వమ్మయిన ఆశలు ప్రజల మధ్య ఘర్షణలకూ, ద్వేషాలకూ దారితీస్తాయి. ఆర్థిక సంక్షోభం, సామాజిక కల్లోలం మిగులుతాయి.

**కాం**ట్రాక్టర్లు మాత్రం బాగుపడతారు. ఇంతా అంతా కాదు, చాలా బాగుపడతారు. 'జలయజ్ఞం' అందుకోసమేనా అని అడిగితే రాజశేఖర రెడ్డి అభిమానులకు కోపం వస్తుందేమో. కానీ ఇప్పుడే కోపం చేసుకోకుండా చివరిదాకా చదివి అప్పుడు చెప్పమని మా మనవి.

❖ **రెం**డేళ్ళ లోపల పూర్తిచేయబోయే ప్రాజెక్టులలో వంశధార స్టేజ్-2, ఫేజ్-1 ఒకటి. స్టేజ్-2కోసం నేరడి దగ్గర మన ప్రభుత్వం ప్రతిపాదించిన మళ్లింపు పథకానికి ఒరిస్సా ఇన్నేళ్లుగా ఒప్పుకోలేదు. కాబట్టి ప్రస్తుతానికి నేరడికి దిగువన కాట్రగడ దగ్గర సైడ్ కాలవ తీసి ఎంత నీళ్లొస్తే అంత తీసుకుంటామనీ, దీనికి స్టేజ్-2 ఫేజ్-1 అని

పేరు పెడతామనీ అంటున్నారు. బాగానే వుంది. కానీ అన్ని నిర్మాణాలూ స్టేజ్-2కు తగినట్లు చేసేస్తున్నారు. హిర మండలం దగ్గర 19 టిఎంసిల రిజర్వాయర్ కడుతున్నారు. దానిపైన రెండు బ్యాలన్సింగ్ రిజర్వాయర్లు కడుతున్నారు. 20 వేల ఎకరాలకు వరద కాలవ, 82 వేల ఎకరాలకు కుడికాలువ తవ్వేస్తున్నారు. వంశధార స్టేజ్-1 కింద ఇప్పటికే ఒక పంటకు నీళ్లొస్తున్న 1,48,000 ఎకరాలకు స్టేజ్-2 ద్వారా రెండవ పంటకు నీళ్ళివ్వడానికి 'లింక్' కాలువ తవ్వేస్తున్నారు. హిర మండలం రిజర్వాయర్‌కోసం 21 గ్రామాలను ఖాళీ చేయించేస్తున్నారు. రైతులతో బేరంపెట్టి నష్టపరిహారంతో సంతృప్తిపరచి పంపించేద్దామని చూస్తున్నారు. ఇంతాచేసి ఒరిస్సా నేరడి బ్యారేజికి సమ్మతి ఇవ్వకనేపోతే? ఇప్పుడు ఫేజ్-1 పేరిట చేపట్టే కాట్రగడ సైడ్ కాలువ అందులో మూడవ వంతు నీరు మాత్రమే ఇస్తుంది. దానితోనే సరిపెట్టుకోవలసి వస్తే? నీళ్ళు లేని కాలువలు, నేల తడవని రిజర్వాయరు ఎవరిని ఉద్ధరించడానికి కట్టినట్టు? కాలవొచ్చింది కదా ఇక నీళ్ళు రావా అని ఎదురుచూసే ఆయకట్టుదార్లను ఎవరు ఊరడించేటట్టు?

ఒరిస్సాతో వున్న తేడాను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోలేకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని కోరి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయించుకోవాలి. ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం వంశధార స్టేజ్-2 కట్టుకోవాలి. అంతేతప్ప 'ఆలూ లేదు చూలూ లేదు' అనే ఈ న్యవహారం ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికి తప్ప ఇంక దేనికోసం ఉద్దేశించబడింది?

ఒక్క వంశధారే కాదు, జంఝావతి, నాగావళి,బాహుద నదుల విషయంలోనూ ఒరిస్సాతో మనకు విభేదాలున్నాయి. చెరిసగం నీళ్లు తీసుకోవాలన్న స్థూలమైన ద్వైపాక్షిక ఒప్పందాలున్నాయి గానీ ప్రతీ ప్రాజెక్టు విషయంలోనూ తేడాలొస్తున్నాయి. అవి ద్వైపాక్షికంగా పరిష్కారం కావని గడచిన అయిదు దశాబ్దాలలో అర్థమయిపోయింది. ప్రతిపాదిత ప్రాజెక్టులకోసం ట్రిబ్యునల్ ఏర్పాటును ఆహ్వానించి దాని తీర్పు వచ్చేదాకా ఆగడం విజ్ఞతగల పాలన అనిపించుకుంటుంది. 'ప్రాజెక్టు' అనగానే 'టెండర్లు పిలువు' అనేది మతిచెడిన పాలన అనిపించుకుంటుంది.

❖ హడావుడిగా కట్టేస్తున్న ప్రాజెక్టులలో పోలవరం ఒకటి. ఇప్పటికే దీనికి వేలకోట్లు కేటాయించారు. అయితే ఈ ప్రాజెక్టుకు అవసరమయిన మూడు ముఖ్య అనుమతులకు ప్రయత్నం కూడా ఇప్పటిదాకా జరగలేదు. ఒకటి, కేంద్ర అటవీశాఖ అనుమతి. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 10,000 ఎకరాల అడవి మునుగుతుంది కాబట్టి దీనిని చేపట్టడానికి కేంద్ర అటవీశాఖ అనుమతి కావాలి. రెండవది కేంద్ర సామాజిక న్యాయ శాఖ అనుమతి. ఈ ప్రాజెక్టు కింద దాదాపు లక్షన్నర జనాభా నిర్వాసితులవుతారు. అందులో సగం ఆదివాసులు. కాబట్టి కేంద్ర సామాజిక న్యాయశాఖ అనుమతి లేకుండా ప్రాజెక్టు చేపట్టడానికి వీలులేదు. మూడోది, పర్యావరణ అనుమతి. గోదావరి లోయ అడవులు జీవావరణం (బయోస్పియర్) దృష్ట్యా విలువయినవని పర్యావరణ నిపుణులు భావిస్తే ఈ అనుమతి దక్కదు.

'అనుమతులు వచ్చినప్పుడు వస్తాయి, ఈలోపల పనులు చేసుకుంటూ పోదాం' అన్న వైఖరి చెల్లదనీ, చివరకు అనుమతులు రాకపోతే ప్రజాధనం వృథా అవుతుంది కాబట్టి అన్ని అనుమతులూ తీసుకున్నాకనే పనులు మొదలుపెట్టాలనీ ఈమధ్యనే మన హైకోర్టు పులిచింతల కేసులో రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా మందలించింది. అయినప్పటికీ పులిచింతలలో చేసిన పనే పోలవరంలో మళ్లీ చేస్తున్నారు. రైతులకు నీళ్లివ్వాలన్న ఆరాటంతోనే ఇదంతా చేస్తున్నారని నమ్మలేం. ఎందుకంటే అనుమతులు లేకుండా ప్రాజెక్టు కట్టుకుంటూపోతే ఎప్పుడో ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వమో, కోర్టులో అడ్డం తగులుతాయి. అనుమతులు లేని ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు నీళ్లివ్వడం కల్ల. కానీ కట్టినకాడికి కాంట్రాక్టర్లకు పైసలు మాత్రం దక్కుతాయి.

పోలవరం గురించి మరొక రెండు విషయాలు చెప్పుకోవాలి. మునగబోయే 10,000 ఎకరాల అడవికి మారుగా ఎక్కడో ఒకచోట 10,000 ఎకరాల ప్రభుత్వ బంజరును అటవీశాఖకు అప్పగించి అనుమతి తెచ్చుకునే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేసినా (అంతటి బంజరు భూమి ఒకచోట కాకపోయినా నాలుగయిదు చోట్ల దొరుకుతుందనుకున్నా), సుప్రీం కోర్టు అడ్డంపడగలదు. రాజశేఖరరెడ్డి గారి న్యాయ సలహాదారులు వారికీ విషయం చెపుతున్నారో లేదోగానీ కొన్నేళ్ళుగా సుప్రీంకోర్టు అటవీ భూముల బదలాయింపు మీద నిత్యనిషేధం వేసి వుంది. 'గోదావర్మన్ కేసు' అనే కేసొకటి సుప్రీంకోర్టులో వుంది. ఆ కేసులో సుప్రీంకోర్టు తుదితీర్పు ఇవ్వదలచుకోలేదు. దానిని అడవుల సంరక్షణకు ఒక సాధనంగా వాడుకోదలచుకుంది. రెండు మూడు నెలలకొకసారి ఆ కేసు విచారణకొస్తుంది. ఆ మధ్యకాలంలో అటవీ భూముల బదలాయింపుకు ఎక్కడ అనుమతి ఇచ్చివున్నా దానిపైన ఎవరైనా ఆ కేసు విచారణ సమయంలో మధ్యంతర అర్జీ పెట్టుకోవచ్చు. సుప్రీంకోర్టు దానిపైన నిపుణుల చేత విచారణ జరిపించి, ఆ అనుమతి చెల్లుతుందా లేదా అన్నది చెప్తుంది. చాలా సందర్భాలలో కఠినంగా వ్యవహరిస్తూ వుంది.

రెండవది, ఈ అడ్డంకులన్నీ తొలగినా ఆదివాసుల ప్రతిఘటనను ప్రభుత్వం ఎదుర్కొనవలసి వుంటుంది. పోలవరం వల్ల ఎంత తక్కువన్నా 70,000 ఆదివాసీ జనాభా నిర్వాసితులవుతారు. వారి బతుకులు ఛిద్రమవుతాయి. వారు అంత సులభంగా తమ ఊళ్ళనూ కొండలనూ అడవులనూ విడిచిపెట్టి పోరు. ఎవరి నాయకత్వం

*వంశధార స్టేజ్-2 ఒకవేళ ఒరిస్సా ఒప్పుకోలు వల్ల సాధ్యమైనా దానిని ప్రస్తుత రూపంలో చేపట్టడం ఉచితమా అనేది ఆలోచించాలి. హిర మండలం రిజర్వాయర్ వల్ల నిర్వాసితులయి అంతో యింతో నష్టపరిహారం పొందే గ్రామాలు 21 కాగా, మరొక 80 ఆదివాసీ గ్రామాలు రిజర్వాయర్ ఆవలనున్న కొండల మీద చిక్కుపడిపోతాయి. ఆ ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. బయటకు పోవాలంటే రిజర్వాయర్‌కు అడ్డంగా ఈదుకొని పోవాలి, లేకపోతే వెనక్కి తిరిగి మూడు నాలుగు కొండలెక్కి దిగాలి. అధికార యంత్రాంగం ఈ విషయాన్ని కనీసం గుర్తించకపోవడం మన సమాజంలో ఆదివాసుల స్థితికి అద్దం పడుతుంది.*

వున్నా లేకపోయినా వారికి తోచిన పద్ధతిలో ప్రతిఘటిస్తారు. వాళ్ల తలలు పగలగొట్టకుండా కాళ్లు చేతులు విరగ్గొట్టకుండా పోలవరం సాధ్యంకాదు. ఇప్పటికే అభివృద్ధి చెందివున్న కోస్తాంధ్ర జిల్లాలలో ఇంకొక 8 లక్షల ఎకరాలకు సాగు నీరివ్వడానికి అభివృద్ధిలో అట్టడుగున వున్న ఆదివాసులను – అందులోను అంత పెద్దమోతాదులో – అణచివేతకు గురిచేయడాన్ని మానవత్వం వున్న వాళ్లెవరూ ఆమోదించలేరు.

❖ శ్రీశైలం ఎడమగట్టు కాలవ, ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు, హంద్రీ–నీవా, గాలేరు–నగరి, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, పెన్నహోబిలం, తెలుగుగంగ, వెలిగొండ రాజశేఖరరెడ్డి గారి 'జలయజ్ఞం'లోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు. వీటిలో ఒక్కదానికీ ఒకచుక్క నీటి కేటాయింపు లేదు. వీటికోసం కృష్ణా–తుంగభద్ర నదులలో ఒక్కచుక్క నీరు తీసుకునే హక్కు మనకు లేదు. అయినప్పటికీ తెలుగుగంగ కొన్నేళ్లుగా కట్టుకుంటూ పోతున్నారు, ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ దాదాపు పూర్తిచేశారు. ఇప్పుడు మిగిలిన వాటన్నిటికోసం వందలూ వేల కోట్ల రూపాయలు కేటాయించి కాలవల తవ్వకం, ఎత్తిపోతల రూపకల్పన మొదలుపెట్టారు.

ఇవన్నీ తీవ్ర వర్షాభావ ప్రాంతాల ప్రాజెక్టులు కాబట్టి వీటికి వ్యతిరేకంగా మాట్లాడాలంటే ఎవరికైనా బాధ అనిపిస్తుంది కానీ సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ల జేబులు నింపి ప్రజలలో ఆశలు రేకెత్తించి చివరికి ప్రజల మధ్య విద్వేషాలు మిగిలించే కంటే ముందునుండే వాస్తవాలు తెలుసుకోవడం మంచిది. మొదటి కృష్ణా జలాల ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్) చేసిన నీటి కేటాయింపుల ప్రకారం ఈ ప్రాజెక్టులేవీ కట్టుకునే హక్కు మనకు లేదు. రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ మనకేమయినా హక్కు ఇస్తుందన్న ఆశ వున్నట్టయితే ఆ ట్రిబ్యునల్ ముందుకు పోవాలి. నేరుగా వాదించి ఏదో ఒకమేరకు హక్కు సంపాదించుకోవాలి. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి ఆ బేసిన్‌లో నీటి కొరత సమస్యను పరిష్కరించదలచుకున్నా ట్రిబ్యునల్ ముందుకు పోక తప్పదు. దీని సాధ్యాసాధ్యాల గురించి ఇంకొక సందర్భంలో మాట్లాడుకుందాం గానీ, ఎంత నేర్పు ప్రదర్శించినా మనకు ఎక్కువ దక్కడం కష్టం. ఎందుకంటే ఇప్పటికే మనం కృష్ణా బేసిన్‌లో చాలా ఎక్కువ నీళ్లు తీసుకుంటున్నాం. కాబట్టి పైన ఏకరువు పెట్టిన ప్రాజెక్టులన్నీ సాధ్యపడడం కల్ల. అతి కష్టంమీద వాటిలో రెండింటికో మూడింటికో అనుమతి తెచ్చుకోవచ్చునేమో.

ఇప్పటికే రెండవ కృష్ణా ట్రిబ్యునల్ కూర్చొనింది. అందరి వాదనలూ, విజ్ఞాపనలూ వినడానికి సిద్ధమవుతూ వుంది. విజ్ఞతగల ప్రభుత్వం దానిమీద దృష్టి పెట్టి, అక్కడ ఏ మేరకు నీటి హక్కు దక్కితే ఆ మేరకు వీటిలో రెండింటినో మూడింటినో న్యాయబద్ధంగా ఎంపిక చేయవలసి వుండింది. దాని బదులు అన్నిటికీ విచ్చలవిడిగా డబ్బులు కేటాయించి ప్రజలలో ఆశలు రేకెత్తించడం వల్ల జరిగేదేమిటంటే, కేటాయించి ఖర్చు పెడుతున్న డబ్బులో నూటికి డెబ్బై రూపాయలు తప్పనిసరిగా వృధా కావడం; రేపు ఈ ప్రాజెక్టులలో ఏ రెండు మూడింటిని ఎంపిక చేసినా ప్రజలలో తీవ్ర అసంతృప్తి ఏర్పడడం; ప్రాంతాలవారీగా, జిల్లాల వారీగా ప్రజల మధ్య విద్వేషాలు చెలరేగడం. ఇది తెలివితక్కువతనం మాత్రమే కాదు, దుర్మార్గం కూడా.

❖ రాజశేఖరరెడ్డి 'జలయజ్ఞం' విద్యుత్ వినియోగం విషయంలో రాష్ట్రం మొత్తంమీద పెద్దభారాన్ని వేయబోతున్నది. ఆయనగారు పూర్తిచేయబోయే 30 ప్రాజెక్టులలో 17 ఎత్తిపోతల పథకాలు. చిన్నా, చితక ఎత్తిపోతలు మనకు పరిచయమే. అవి రాష్ట్రంలో ఎక్కడా సఫలం కాలేదన్న సంగతి కూడా తెలిసినదే. అలాంటిది ఇవి చిన్నా,చితక పథకాలు కూడా కావు. భారీ ఎత్తిపోతల పథకాలు. అయితే ఇక్కడ మేము వాటి సాంకేతిక సాధ్యాసాధ్యాల గురించి మాట్లాడడం లేదు. విద్యుత్ వినియోగాన్ని గురించి, దానికయ్యే ఖర్చుల గురించి మాత్రమే మాట్లాడుతున్నాం.

**30** ప్రాజెక్టులలో 17 ఎత్తిపోతల ప్రాజెక్టులంటే అర్థం, కొత్తగా సాగునీటి వసతి కల్పించబోయే 65 లక్షల ఎకరాలలో 35 లక్షలదాకా ఎత్తిపోతల కింద వుంటాయని. ఒక్కొక్క ఎత్తిపోతల పథకంలో నీటిని ఎంత ఎత్తుకు లిఫ్ట్ చేయవలసి వుంటుందనేది ప్రాజెక్టును బట్టి వుంటుంది. 50 మీటర్ల నుంచి 300 మీటర్ల దాకా లిఫ్ట్ అవసరం అవుతుందని స్థూలంగా చెప్పవచ్చు. సగటున 150 మీటర్లు ఎత్తిపోయవలసి వుంటుందనుకుందాం. 1 ఎకరానికి అవసరమయిన సాగునీరు 100 మీటర్లు లిఫ్ట్ చేసి పోయడానికి 1000 యూనిట్ల కరెంటు అవసరం అవుతుందని అంచనా. యూనిట్‌కు 2 రూపాయల ధర వేసుకున్నా 150 మీటర్లు ఎత్తిపోయడానికి ఎకరానికి 3000 రూపాయలు అవుతుంది. ఏ రైతూ అంతమొత్తం కాదుకదా అందులో 10వ వంతు మించి పెట్టుకోలేడు. మిగిలినది ప్రభుత్వమే పెట్టుకోవలసి వుంటుంది. 35 లక్షల ఎకరాలకు ఇది ఎంత అవుతుందంటే ఇప్పుడు మొత్తం వ్యవసాయ బోర్లు, మోటార్లకు అవసరమైన కరెంటుకోసం రాష్ట్రంలోని రైతులంతా కలిసి ఖర్చు చేస్తున్నంత. (ఈ విషయం లెక్కలు వేసి రుజువు చేయొచ్చు). అంటే రాజశేఖరరెడ్డి గారి 'జలయజ్ఞం' ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం భరించవలసిన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ రెండు రెట్లవుతుంది. ఇప్పుడిస్తున్నదే మోయలేని పాలకులు దీన్ని రెండురెట్లు పెంచితే మోస్తారా? జలయజ్ఞం అయిపోయిన తర్వాత కరెంటు సబ్సిడీ మేమియ్యలేము, మీరే బిల్లు కట్టండి అంటే రైతులేం కావాలి? అంత ఖరీదయిన సాగునీరు మాకు అక్కరలేదని రైతులంటే ఇంత హంగామా చేసి కట్టిన ప్రాజెక్టులు ఏం కావాలి?

ఎత్తిపోతల ప్రాజెక్టులు ఎన్నయినా చేపట్టవచ్చుననే పద్ధతిలో వ్యవహరించడమే తెలివితక్కువతనం. కాగల ఖర్చును దృష్టిలో వుంచుకొని అత్యవసరమైన వాటికి పరిమితం కావడం ఉచితమనిపించుకుంటుంది. గోదావరి జలాలలో మనకింకా వాటా వుంది కాబట్టి గుత్ప, అలీసాగర్‌లతో పాటు ఉత్తర తెలంగాణాలో 300 మీటర్ల కాంటూరుకు ఎగువన వున్న మెట్ట నేలలకు నీరిచ్చే శ్రీరాంసాగర్ వరద కాలవకు, ప్రాణహిత నుంచి నీళ్లు మళ్లించి రూపొందించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకూ ప్రస్తుతానికి పరిమితం కావడం మంచిది.

# అయితే ఏం చేయాలి?

మరి ప్రభుత్వం ప్రాజెక్టులే చేపట్టవద్దంటారా అని అడుగుతారేమో.

వద్దని మేము అనడం లేదు. చేపట్టదగినవి 'జలయజ్ఞం' లిస్టులోనూ వున్నాయి. ఆ లిస్టులో లేనివీ వున్నాయి.

ఏ అనుమతులూ అక్కరలేకుండా, ఎవరినీ నిర్వాసితులు చేయకుండా, ఏ పొరుగు రాష్ట్రంతోనూ గొడవ లేకుండా వెనుకబడిన ప్రాంతాలకూ, దుర్భిక్ష ప్రాంతాలకూ సాగునీరివ్వగల ప్రాజెక్టులు వున్నాయి. అవి రాజశేఖరరెడ్డి గారి ముప్పైలో లేకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయం.

❖ పెన్‌గంగ నదిమీద మహారాష్ట్ర ఆదిలాబాద్‌కు ఉత్తరాన దిగువ పెన్‌గంగ ప్రాజెక్టు కట్టింది. ప్రాజెక్టు ఖర్చులో 12 శాతం మనం చెల్లించి ఒకకాలవ తవ్వుకొని 5.6 టిఎంసిలనీళ్ళు తీసుకుపోవచ్చని చెప్పింది. 12 శాతం అంటే కేవలం 240 కోట్లు. ఆ మొత్తం మహారాష్ట్రకు ఇచ్చేస్తే చాలా వెనుకబడిన తాంసి, బేలా, జైనత్ మండలాలలోని 61 గ్రామాలలో 40,000 ఎకరాలకు నీళ్లొస్తాయి. 'జలయజ్ఞం'లో ఇదెందుకు లేదు? అసలు 'జలయజ్ఞం'లో ఆదిలాబాద్‌కు నీళ్ళిచ్చే ఒక్క ప్రాజెక్టూ ఎందుకు లేదు?

❖ రాజోలిబండ మళ్లింపు పథకాన్ని ఆధునీకరించి దాని ఆయకట్టును పూర్తిస్థాయిలో కాపాడమని మహబూబ్‌నగర్ ప్రజలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. దీనికి ఏ అనుమతులూ అక్కరలేదు, ఎవరినీ ముంచనక్కరలేదు. రాష్ట్రంలోని పాత ప్రాజెక్టులొక్కొక్కటీ ఆధునీకరిస్తూ వాటి ఆయకట్టులు కాపాడుతూ వస్తున్నారు కదా. 19వ శతాబ్దపు ప్రాజెక్టులయిన గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, కె.సి.కెనాల్‌లను పూర్తిస్థాయిలో ఆధునీరించారు. కె.సి. కెనాల్‌ను ఇంకా ఆధునీకరించే పథకం 'జలయజ్ఞం'లోని ముప్పై పథకాలలో ఒకటి. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో నిర్మించిన విజయనగరం జిల్లా తోటపల్లిని ఆధునీకరించడమే కాక మళ్లింపు పథకం స్థానంలో చిన్నపాటి డ్యాం నిర్మించి ఆయకట్టు పెంచుతున్నారు. అయితే వీటి తరువాత వరుస క్రమంలో వచ్చే పాత ప్రాజెక్టులయిన రాజోలిబండ ఊసేలేదు. 87 వేల ఎకరాల ఆయకట్టు ముప్పైవేలకు పడిపోయిన ఈ ప్రాజెక్టు మీద తగిన మొత్తం ఖర్చుపెడితే 50,000 ఎకరాలు సస్యశ్యామలమవుతాయి.

❖ హోస్పేటలోని తుంగభద్ర డ్యాంలో పూడిక 30 టిఎంసిల మేరకు పేరుకొని పోవడం వల్ల అనంతపురం, కర్నూలు జిల్లాలకు నీళ్లిచ్చే తుంగభద్ర కుడిగట్టు ఎగువ కాలవ, దిగువ కాలవలు బాగా దెబ్బతిన్నాయి. వాటి ఆయకట్టులో సగం కూడా తడవడం లేదు. అయితే ఈ రెండు కాలవలు కర్నాటకలోని భూములకు నీళ్లిచ్చి మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి కాబట్టి ఈ సమస్య మనదే కాదు, వారిది కూడా. అందువల్ల, పూడిక కారణంగా టి.బి. డ్యాంలో నిలవకుండా వున్న నీటిని సమాంతర కాలవల ద్వారా దాని గమ్యానికి తీసుకుపోవడం కర్నాటకకూ అభ్యంతరం వుండదు. ఎగువ కాలవకు సమాంతర కాలవను కర్నాటకే ప్రతిపాదించింది. మనమే స్పందించడం లేదు. దిగువ కాలవకూ అదే ఉభయతారకమైన ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంతలేదన్నా ఒక లక్ష ఎకరాలను తిరిగి ఆయకట్టులోకి తేగల ఈ పథకాలు జలయజ్ఞంలో ఎందుకు లేవు?

❖ నల్గొండ జిల్లాలోని మునుగోడు, సంస్థాన్ నారాయణపురం మండలాల ఫ్లోరైడ్ సమస్య అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో 'జలయజ్ఞం' అంటూ జరిగితే ఈ గ్రామాలకు నీళ్లివ్వడం అంగులో ఒక ముఖ్య కార్యక్రమం కావాలి. కానీ కాంగ్రెస్ వారి జలయజ్ఞంలో ఈ ప్రస్తావన లేదు. దీనికి అనువయిన మార్గాలు లేకపోలేదు. అక్కంపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 4 టిఎంసిలు ఆ గ్రామాలకు కేటాయించినా, పులిచింతలకు కేటాయించిన 9 టిఎంసిల నికర జలాలలో సగం ఆ గ్రామాలకు బదలాయించినా వారి సమస్య తీరుతుంది.

ఎప్పుడో లేక ఎవరో కట్టేసిన ప్రాజెక్టులకు కేవలం మరమ్మతులు చేయడం లేదా ఒకటీ అరా కాలవలు తవ్వడం పెద్దగా జేబులు నింపే వ్యవహారం కాదు కాబట్టే తక్కువ ఖర్చుతో ఖచ్చితమైన ఫలితం పొందగల ఈ పనులను నిర్లక్ష్యం చేస్తున్నారనుకోకూడదా?

## ముగింపు

ఆంధ్రప్రదేశ్ హరితాంధ్రప్రదేశ్ కావలసిందే. కానీ దానికి జరగవలసింది వేలకోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్ల జేబులలో పోసి జనానికి అసాధ్యమైన ఆశలు కల్పించి సాగునీటి వనరులన్నీ రాజకీయ ప్రాబల్యం గల ప్రాంతాలకు కట్టబెట్టి చివరికి అప్పులూ, విధ్వంసమూ, ప్రజల మధ్య విద్వేషమూ మిగిల్చే అడ్డగోలు సాగునీటి ప్రయోగం కాదు. సాగునీటిని సార్వజనీనమైన హక్కుగా గుర్తించి, అనువయినవీ, అవసరమయినవీ, విధ్వంసకరం కానివీ అయిన నదీజలాల ప్రాజెక్టులు చేపట్టి, మండలానికి రెండు చెరువులను ఎంపిక చేసి సమగ్రంగా మరమ్మతు చేసి, భూగర్భ జలాల పెంపుదలకోసం, భూసార సంరక్షణకోసం తగు చర్యలు చేపట్టే సాగునీటి విధానం. అదే ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇవ్వగలదు, రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి ఒక పంటకైనా సాగునీరు ఇవ్వగలదు.

10, జూన్ 2005

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)